## క్లుప్తంగా

### ముగిసిన బ్రహ్మోత్సవాలు



సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ కల్కిదోనగుట్ట గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, వేదపఠనం, సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, పట్టాభి రామశర్మ, స్థానికులు శ్రీనివాస్, శ్యాంసుందర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తాండాకు చెందిన కేస్లీ ఇటీవల మృతిచెందింది. కేస్లీ కుటుంబ సభ్యులను బుధవారం ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలను మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, నాయకులు పత్యా, పాండు, లాల్యా పాల్గొన్నారు.

### పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనుల పరిశీలన



కాంట్రాక్టర్‌కు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ఉపేందర్, కడ్తాల ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, కడ్తాల ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జీఎల్‌ఎన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు వీరయ్య, మోత్యానాయక్, జహంగీర్ అలీ, బాలకృష్ణ, చందోజీ ఉన్నారు.

### ఘనంగా షబ్-ఎ-బరాత్ వేడుకలు



కడ్తాల మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆమనగల్లు: ఆమనగల్లు, కడ్తాల మండల కేంద్రాల్లో మంగళవారం షబ్-ఎ-బరాత్ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలను పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంతో పాటు కడ్తాల మండలం కేంద్రంలోని వివిధ మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి జాగరణ చేసి ఖురాన్ పఠించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పాడిపంటలు అభివృద్ధి చెందాలని అల్లాను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆయా మసీదు కమిటీల అధ్యక్షులు మాసూం, గౌస్, ఖాదర్, అబ్దుల్ రవూఫ్, అహ్మద్‌జానీ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలి

చంపాపేట: విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జైళ్ల శాఖ విశ్రాంత ఐజీ సైదయ్య అన్నారు. బుధవారం చంపాపేట భాష్యం పాఠశాలలో సంతోష్‌నగర్, మీర్‌పేట భాష్యం లిటిల్ చాంప్స్ ప్రాథమిక పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భాష్యం విద్యా సంస్థల సీఈఓ చైతన్య, జెడ్‌ఈఓ అంకమ్మరావులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ... చిన్నారులను సెల్ ఫోన్ కల్చర్‌కు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన ఫోక్, వెస్ట్రన్, శాస్త్రీయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సునీత, ప్రీతాసునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 23, బెండ 52, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 10, ఫ్రెంచిబీన్స్ 60, క్యారెట్ 15, దొండ 35–45, చిక్కుడు 45, గోకర 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 19, దోస 45, సొర 17, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ 68. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

# మహిళా సాధికారతతోనే అభివృద్ధి



తుర్కయంజాల్: కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్లు కేక్‌లు కట్‌చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన మహిళలు, మహిళా ఉద్యోగులను ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు, ప్రజలు సన్మానించారు. ఆయా సన్మాన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ.. మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. దేశ ప్రగతిలో మహిళల పాత్ర ఎంతగానో ఉందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారికి సమాన అవకాశాలు ఇద్దామన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



ఆమనగల్లు: మహిళలను సత్కరిస్తున్న మున్సిపల్ పాలకవర్గం



కడ్తాల: మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



యాచారం: పీహెచ్‌సీలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ సుకన్య



తలకొండపల్లి: చెన్నారంలో మహిళా దినోత్సవ వేడుకలు



ఇబ్రహీంపట్నం విద్యాంజలి కళాశాలలో వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కార్యాలయంలో..



హయత్‌నగర్: వేడుకలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు

# రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామ రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆర్ అండ్‌బీ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎనిమిది సంవత్సరాల్లో నియోజకవర్గంలోని రహదారులను రూ.500 కోట్లతో డబుల్‌రోడ్లుగా మార్చాడానికి కృషి చేశామన్నారు . ఇబ్రహీంపట్నం నుంచి ఎలిమినేడు, పోచారం, మంగళ్‌పల్లి మీదుగా డబుల్‌రోడ్డు ఏర్పాటుకు రూ.59 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూ.25 కోట్లతో యాచారం నుంచి మీరఖాన్‌పేట వరకు, నందివనపర్తి నుంచి మేడిపల్లి వరకు, రూ.40 కోట్లతో పెద్దంబర్‌పేట నుంచి కావడిపల్లి వరకు, రూ.7.80 కోట్లతో ఆగాపల్లి నుంచి తులేకలాన్ వరకు రూ.3.09 కోట్లతో డబుల్‌లేన్ల రోడ్ల విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో నియోజకవర్గంలో మరిన్న రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, నీటి పారుదల శాఖ డీఈ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని పాత గ్రామంలో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయని, పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాత గ్రామంలోని రజక బస్తీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీలను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. నాయకులు బండారి భాస్కర్, ఎర్రవెల్లి సత్యనారాయణ, బండారి స్వామి, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమమే గెలిచింది

- బొక్కల కంపెనీని సీజ్ చేసిన అధికారులు
- 35 రోజుల దీక్షను విరమించిన కొత్తపల్లి గ్రామస్తులు



కంపెనీ గేట్ ఎదుట కొత్తపల్లి గ్రామస్తులు

యాచారం: ప్రజా ఉద్యమం గెలుపొందింది. గ్రామాన్ని విషపూరిత వ్యర్థాలతో కలుషితం చేస్తున్న బొక్కల కంపెనీని అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి–తక్కళ్లపల్లి గ్రామాల మధ్యన ఐదేళ్ల కింద కిసాన్ ఆగ్రో ఫీడ్ పేరుతో ఓ ప్రైవేట్ కంపెనీని స్థాపించారు. మొదట్లో ఏం కాలుష్యం ఉండదని ప్రజలను నమ్మించిన యజమాన్యం అనంతరం పశువుల కళేబరాలు, బొక్కలు తెచ్చి.. నూనెను, ఇతర ఫీడ్‌ను తయారు చేయసాగింది. తయారీ సమయంలో కంపెనీ నుంచి వెదజల్లే దుర్వాసనకు కొత్తపల్లి గ్రామంతో పాటు తక్కళ్లపల్లి, మాల్, కిషన్‌పల్లి, తమ్మలోనిగూడ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కంపెనీ నడవడంతో వచ్చే దుర్వాసనకు చుట్టుపక్కల ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా స్పందన కనిపించలేదు. ప్రజా ఉద్యమంతోనే కంపెనీపై పోరాడాలని గ్రామస్తులు నిర్ణయించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, కొత్తపల్లి ఉప సర్పంచ్ కావలి జగన్, వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు 35 రోజులుగా కంపెనీ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. దీక్ష చేపట్టిన వారికి కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల సర్పంచ్ లు హబీబుద్దీన్, సంతోషతో పాటు పలు పార్టీలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధు లు, రాజకీయ పక్షాల నాయకులు మద్దతు పలికారు.

**అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే...**

కొత్తపల్లి గ్రామస్తుల ఇబ్బందులపై స్వయంగా తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బొక్కల కంపెనీ మూసివేయాలంటూ పక్షం రోజుల కింద అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. రాష్ట్ర పొల్యూషన్ బోర్డుకు లేఖ రాసారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కంపెనీని సందర్శించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. పూర్తి విచారణ అనంతరం కొత్తపల్లి గ్రామంలో కాలుష్య కారక బొక్కల కంపెనీని మూసేస్తున్నట్లు ప్రభుత్వం బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీ మూసివేతకు సహకరించిన ఎమ్మెల్యేకు కొత్తపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# అద్దె భవనం.. అరకొర వసతులు



కొనసాగుతున్న కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులు



అద్దె భవనంలో నేలపైన పాఠాలు వింటున్న విద్యార్థినులు

- కడ్తాల్ కేజీబీవీ పాఠశాలకు సొంత భవనం కరువు
- ఆరేళ్లుగా అద్దెభవనంలోనే విద్యాబోధన
- నత్తనడకన సొంత భవన నిర్మాణ పనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కడ్తాల్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో 2017–18 విద్యాసంవత్సరంలో అద్దెభవనంలో ప్రారంభమైన కేజీబీవీ పాఠశాలకు నేటికీ సొంత భవనం కల నెరవేరలేదు. అద్దె భవనంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. చాలీచాలని తరగతి గదుల్లో నేలపైన కూర్చుని విద్యనభ్యసిస్తున్నారు. ఎస్‌ఎస్‌సీ వార్షిక పరీక్షల్లో ప్రతియేటా 100 శాతం ఫలితాలు సాధిస్తున్నా వసతులు కల్పించడంపై అధికారుల శ్రద్ధ చూపడంలేదు. ప్రస్తుతం పాఠశాలలో 194 మంది విద్యార్థినులకు గాను 10మంది ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుంది. పాఠశాలలో అటెండర్, స్వీపర్, ఇద్దరు వంట మనుషులు, వాచ్ ఉమెన్ ఉన్నారు. భోజనాలు చేసేందుకు ప్రత్యేకంగా గదిలేకపోవడంతో వరండాలోనే భోజనాలు చేస్తున్నారు. బాత్రూమ్‌లు విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా లేవు. ఆటస్థలం లేకపోవడంతో విద్యార్థినులు క్రీడలకు దూరమవుతున్నారు. పాఠశాల సమీపంలో మురుగునీరు నిల్వ ఉండటంతో మురుగు వాసన తప్పడం లేదు. విద్యార్థుల కష్టాలు తీరాలంటే అన్ని వసతులతో కూడిన సొంత భవ నం కావాలని ఆరేండ్లుగా కోరుతున్నప్పటికీ నేటికీ సొంతభవనం నిర్మాణం పూర్తిచేయడంలేదు.

**మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు..**

మండల కేంద్రం నుంచి కానుగుబావితండాకు వెళ్లే రహదారి పక్కన రెండెకరాల విస్తీర్ణంలో విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.3.35 కోట్ల వ్యయంతో మార్చి12, 2020లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కేజీబీవీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి మూడేళ్లు పూర్తయినప్పటికీ నేటికీ భవన నిర్మాణ పూర్తికాలేదు. గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ వరకు పూర్తయ్యాయి. సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతుందని కాంట్రాక్టర్ వాదన విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చినప్పుడు గుత్తేదారు పనులు చేపట్టడం ... తిరిగి కొన్ని రోజులకే పనులు నిలిపివేస్తూ రావడంతో భవన నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మొదటి ఫ్లోర్‌కు సంబంధించి పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. వెంటనే కేజీబీవీ భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

> **అందుబాటులోకి తెస్తాం**
>
> 
>
> కేజీబీవీ సొంత భవన నిర్మాణ పనుల్లో ఆలస్యం అవుతున్న మాట వాస్తవమే. నెల రోజుల క్రితం సమస్యను మంత్రి సబితా రెడ్డితో పాటు, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో కాంట్రాక్టర్ ఇటీవల పనులను తిరిగి ప్రారంభించారు. త్వరలో పనులు పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. అన్ని హంగులతో కూడిన భవనాన్ని జూన్‌లో ప్రారంభించి అందుబాటులోకి తెస్తాం.
>
> – దశరథ్‌నాయక్, జెడ్పీటీసీ, కడ్తాల్

# గడువులోగా వాయిదాలు చెల్లించండి

- డీసీసీబీ డీజీఎం ఉదయశ్రీ
- రైతుల ఇంటివద్దకు వెళ్లి రుణాల రికవరీ



చౌదర్‌పల్లిలో రైతు వద్ద వాయిదా కట్టించుకుంటున్న ఉదయశ్రీ తదితరులు

యాచారం: దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతుల ఇళ్లకు వెళ్లి బకాయిలు వసూల్ చేయాలని డీసీసీబీ బ్యాంకు డీజీఎం ఉదయశ్రీ పేర్కొన్నారు. యాచారం పీఏసీఎస్‌లో దీర్ఘకాలిక రుణాలు పొందిన చౌదర్‌పల్లి, యాచారం, నందివనపర్తి, నస్దిక్ సింగారం తదితర గ్రామాల్లోని రైతుల ఇంటి వద్దకు బుధవారం ఏజీఎం ఉదయశ్రీ, యాచారం పీఏసీఎస్ సీఈఓ నాగరాజుతో కలిసి వెళ్లారు. మార్చి 30లోపు అప్పు వాయిదాలు చెల్లించాలని కోరారు. ఆయా గ్రామాల్లో పలువురి రైతుల వద్ద నుంచి రూ.20 లక్షలకు పైగా వాయిదా అప్పులు వసూల్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు మార్చి 30లోపు అప్పు వాయిదాలు చెల్లించాలని కోరారు. యాచారం మండలంలోని పలు గ్రామాల్లో 1,500 మందికి పైగా రైతులు రూ.60 కోట్ల దీర్ఘకాలిక రుణాలు పొందినట్లు తెలిపారు. మార్చి 30 లోపు నింబంధనల ప్రకారం మిగితా రూ.29 కోట్లు వసూల్ చేయాల్సి ఉందని అన్నారు. రైతుల ఇంటి వద్దకే వెళ్తే వసూల్ శాతం పెరుగుతుందని సిబ్బందికి సూచించారు. అవసరమైతే రైతులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. రైతులు క్రమం తప్పకుండా అప్పుల వాయిదాలు చెల్లిస్తేనే మరింత మంది రైతులకు రుణాలు అందజేసే అవకాశం ఉంటుందని, పీఏసీఎస్ కూడా ఆర్థికంగా బలపడుతుందని అన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

కడ్తాల, తలకొండపల్లి నేతలతో రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: పీసీసీ అధ్యక్షుడు ఎనుమల రేవంత్ రెడ్డిని బుధవారం కడ్తాల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్చానాయక్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బిక్యానాయక్, గుజ్జల మహేశ్ పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రేవంత్‌రెడ్డి వారికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేంకటేశ్, శ్రీశైలం, అజీం, రవీందర్‌యాదవ్, జనార్దన్ రెడ్డి, ఆరీఫ్, చెన్నకేశవులు, జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, మల్లేశ్‌గౌడ్,ఇమ్రాన్‌బాబా, సత్యం, సేవ్యాబావూజీ, రమేశ్, మహిపాల్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, బాలరాజు, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.తిరుపతి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి జీవనంలో మహిళ పాత్ర పుట్టుక నుంచి చావు వరకు ఎంతో కీలకమని వారికి పురుషులతో సమానంగా హక్కులు ఉంటాయని అభిప్రాయపడ్డారు. అనంతరం న్యాయవాద సంఘం ప్రతినిధులు మహిళా న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. మహిళలను గౌరవిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద సంఘం ప్రతినిధులు, తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకులు సునితా బర్ల, బాచిరెడ్డి శాయి రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు ములుగూరి ఫణీంద్ర భార్గవ్, ఆకుల అనంతసేన్ రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళా న్యాయవాదులు, పీపీలు పాల్గొన్నారు



మట్లాడుతున్న న్యాయమూర్తి తిరుపతి

# డాక్టర్స్ కాలనీ మహిళా మండలి కమిటీ ఎన్నిక

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ మహిళా మండలి నూతన కమిటీని బుధవారం కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా కల్వకుంట్ల మమత, ప్రధాన కార్యదర్శిగా తోడేటి సరిత, కోశాధికారిగా అడ్డు నిత్య, ఉపాధ్యక్షులుగా వక్కలంక అన్నపూర్ణ, కామినేని రామలక్ష్మి, వీరవల్లి జ్యోతి, సంయుక్త కార్యదర్శులుగా పన్నాడి సునీత, తడకల రాధిక, వాణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుగురు సంధ్య, సభ్యులుగా పద్మ, శిరీష, రమాదేవి, పద్మ, సూర్యకళ, రజినీ, శ్రీలక్ష్మీ, వనితారెడ్డి, రచన, మాధవి, దీప, విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ.. మహిళా సమస్యలపై తమవంతు సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు.